18వ
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,17 అక్టోబర్ 2024




## దేశ రాజధానిలో ఉప్పాడ చీరల వైభవం

**– జాంధాని చీరను కొనుగోలు చేసిన హీరోయిన్ కుష్బూ**

**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** ఈ నెల 7వ తేది నుండి దేశ రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీ హాట్ జనకపురిలో జరుగుతున్న వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకాలలో రాష్ట్రంలో ఉన్న అన్ని చేనేత సహకార సంఘాలు వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి కావలసిన అన్ని ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించింది. ఉప్పాడ, వెంకటగిరి, చీరాల, మంగళగిరి, ధర్మవరం, పులగుర్తి, ఎమ్మిగనూరు, పెదన... మొదలైన అన్ని చేనేత మరియు హ్యాండ్ క్రాఫ్ట్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఐఏఎస్ అధికారులు సునీత, రేఖ రాణి ఎగ్జిబిషన్ ప్రారంభించి వారికి కావలసిన అన్ని ఏర్పాట్లను చూసుకుంటున్నారు. 20వ తేది వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుంది.

ప్రత్యేక ఆహ్వానితులు భారత ప్రభుత్వ చేనేత మంత్రిత్వశాఖ అభివృద్ధి కమిషనర్ డా॥ బీనా ఐఏఎస్ మరియు హీరోయిన్ కుష్బూ పాల్గొన్నారు. అనంతరం ఉప్పాడ గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు కాకి గంగాధర్ వద్ద హీరోయిన్ ఖుష్బూ ఉప్పాడ జాంధాన్ని చీరలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ కుష్బూ మాట్లాడుతూ చేనేత రంగాన్ని ప్రతిఒక్కరు ముందుకు నడిపించాలని, ప్రతిఒక్కరు చేనేత దుస్తులను ధరించాలని ఆమె అన్నారు. అదేవిధంగా ఉప్పాడ చీరలు అంటే ఇష్టపడని ఆడవాళ్ళు ఉండరు అని అవి ఎంతో తేలికగా, మృదువుగా ఉంటాయన్నారు. చేనేత కళాకారులు తమ కష్టంతో తయారు చేసిన ఈ చీర ధరించడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. ఆయన వెంట ఉప్పాడ గ్రామానికి చెందిన అందే సత్య మణికంఠ కూడా పాల్గొన్నారు.

# కాసులే ముఖ్యం

## కాకినాడ టౌన్ ప్లానింగ్‌లో అవినీతి కంపు..



సిద్దార్థ నగర్ స్పోర్ట్స్ స్టేడియం రోడ్డులో రెసిడెన్షియల్ అనుమతులు పొంది, ఎటువంటి సెట్‌బ్యాక్స్ వదలకుండా అక్రమంగా కమర్షియల్ లాడ్జ్, ఫంక్షన్ హాల్ నిర్మాణం



నాగవనం వద్ద సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్న కమర్షియల్ భవనం



అనుమతులకు మించి 5వ అంతస్తు అక్రమ నిర్మాణం

- అనుమతులు ఒకలా... నిర్మాణాలు మరోలా
- ఫిర్యాదు చేస్తే పట్టించుకునేవారు కరువు
- అధికారుల అండదండలతోనే చకచకా భవన నిర్మాణ పనులు
- టౌన్ ప్లానింగ్ అధికారులకు భారీగా లక్షల్లో ముడుపులు
- నగరం నడిబొడ్డున విచ్చలవిడిగా కట్టడాలు
- సెట్‌బ్యాక్స్ లేకుండా పూర్తవుతున్న నిర్మాణం
- మార్టిగేజ్ కుడా,కెఎంసిలకు ఉన్నా యధేచ్ఛగా అక్రమాలు
- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకున్నా కరెంట్,పౌర సేవలా
- బహుళ అంతస్తుల మేడలో అగ్ని ప్రమాదం జరిగితే ప్రాణాలు హరీ
- బరితెగించి అక్రమాల పుట్టగా కొందరు లైసెన్స్ సర్వేయర్లు!

కాకినాడ స్మార్ట్ సిటీ రోజురోజుకూ విస్తరిస్తోంది.. రాష్ట్రంలో మూడవ అతిపెద్ద నగరంగా మన జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ నేతృత్వంలో కాకినాడ అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. నగరాభివృద్ధితోపాటు నగరంలోని రోడ్లు, నిర్మాణం జరుగుతున్న భవంతులు సరైన రీతిలో తీర్చిదిద్దితేనే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ నగరం ఇరుకుగా మారుతోంది. అడ్డగోలుగా ట్రాఫిక్ పెరిగిపోయింది. ఉదయం నుంచి రాత్రి 10 గంటలవరకూ వాహనాలు ట్రాఫిక్‌తో ప్రజలు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. నగరంలో ఒకచోట నుంచి మరోచోటకు వెళ్ళాలంటే సమయం వెచ్చించాల్సి వస్తోంది. దీనికి కేవలం నగరంలోని అడ్డగోలు అక్రమ నిర్మాణాలు కారణమని వేరే చెప్పక్కర లేదు. రెసిడెన్షియల్ అనుమంతులతో కమర్షియల్ నిర్మాణాలు చేయడం, పార్కింగ్ లేకుండా కళ్యాణ మండపాలు, లాడ్జిలు నిర్మాణంతో సమస్యలు తలెత్తుతున్నాయి. నాగమల్లితోట నుంచి స్పోర్ట్స్ స్టేడియం రోడ్డులో అక్రమంగా బరితెగించి అతిపెద్ద కమర్షియల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. పార్కింగ్, గ్రౌండ్ మరియు నాలుగు అంతస్థుల రెసిడెన్షియల్ అనుమతులు పొందారు. అయితే అనుమతులకు వ్యతిరేకంగా కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. పార్కింగ్‌లో సగం పైగా అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారు. భవనానికి ముందు వైపు నుంచి నాలుగువైపులా వదలాల్సిన సెట్ బ్యాక్స్ ఎక్కడా వదలలేదు. గ్రౌండ్, మొదటి అంతస్థులు కళ్యాణ మండపం, ఫంక్షన్ హాలు నిర్మిస్తున్నారు. ఆపై మూడు అంతస్థులలో లాడ్జింగ్ కడుతున్నారు. సుమారుగా 24 లాడ్జింగ్ గదులు అక్రమంగా నిర్మిస్తున్నారు. ఆపై ఆరవ అంతస్థు కూడా అత్యంత దారుణంగా బరితెగించి మరీ నిర్మిస్తున్నారంటే టౌన్ ప్లానింగ్ అధికారులు లక్షల్లో మామూళ్ళు పుచ్చుకొన్నారనడానికి ఏవిధమైన సందేహాలు లేవు. అదేవిధంగా ఎస్.వి.రంగారావు బొమ్మ నుంచి నాగవనం వైపు రోడ్డులోనూ అదేతరహాలో బరితెగించి నిర్మాణాలు చేపట్టారు.

రెసిడెన్షియల్ అనుమతులకు కెఎంసికి తక్కువ డబ్బులు చెల్లిస్తే సరిపోతుంది. అదే కమర్షియల్ నిర్మాణాలకు సవాలక్ష అనుమతులు, భూపొరల్లోకి పార్కింగ్ ఇలా రూ.కోట్లు ఖర్చు చెయ్యాలి. ఇవేవీ లేకుండా అక్రమ కమర్షియల్ అనుమతులతో సర్వేయర్లు చేస్తున్న దందాపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలోని పరిశీలనాత్మక కథనం..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :

- మిగతా 2 లో..



## ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన అవసరం

**– జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమార్**



**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయ సాగుపై ప్రతి ఒక్క రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ అన్నారు.మండలంలోని బలరామపురం రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమాని సర్పంచ్ పైల సీత ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరికీ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వ్యక్తిగత పరికరాల వినియోగం కోసం మరియు రాగులు మార్కెటింగ్ కోసం చెప్పడం జరిగింది. గ్రామ మండల స్థాయిలో పనిచేసే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పంటలు సీజన్లో రైతులకు మందులు ఎరువులు వాడకపై అవగాహన కల్పించాలన్నారు. ఆయా రకాల పంటలపై తెగుళ్ళ, మరియు పంటలు దిగుబడి పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో డివిజనల్ అధికారి సుంకరి బుల్లిబాబు ఎంపీటీసీ రవి గ్రామ రైతాంగం మండల వ్యవసాయ అధికారి, విఎఎ, జడ్ బి ఎన్ యఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా సభ్యత్వ నమోదు ఎమ్మెల్సీ ఎన్నికలపై విస్తృత స్థాయి సమావేశం



**పెరవలి, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు పైన రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించడం కొరకు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం అక్టోబర్ 16వ తేదీ బుధవారం వేలివెన్ను గ్రామంలో రైతుసంఘ భవనం నందు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు నేతృత్వంలో జరిగింది. ఈ విస్తృత స్థాయి సమావేశంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు మరియు త్వరలో జరగబోయే ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల గురించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో జరగబోయే ఎన్డిఏ సమావేశం గురుంచి చర్చించి కార్యకర్తలకు,నాయకులకు దిశ నిర్దేశం చేశారు. నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ శాసనసభ్యులు మరియు ఇంఛార్జి బూరుగుపల్లి శేషారావుతో పాటు ఈ సమావేశానికి పార్టీ పరిశీలకులుగా విచ్చేసిన పామర్తి సుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు మరియు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లను గుర్తించి ఓటు నమోదుకి కృషి చేయాలని క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జిలను కోరారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ పట్టణ,మండల అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యం షాప్ పెడితే సహించేది లేదు

**– ఏఐఎండీఎస్ హెచ్చరిక**




**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట బళ్ల మార్కెట్ సెంటర్‌లో మద్యం షాపు పెడితే సహించేది లేదంటూ బళ్ల మార్కెట్ ప్రాంతానికి చెందిన పలువురు ప్రజలు, ఏఐఎండీఎస్ పేరుతో షాపుకు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరా లుగా ఇదే ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహించగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దుచేసి ప్రైవేట్ షాపులకు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. దానితో నేటి నుంచి నూతన మద్యం షాపులు తెరిచేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. కాగా బళ్ల మార్కెట్ ప్రాంతానికి చెందిన పలువురు ఈ ప్రాంతంలో మద్యం షాపును ఏర్పాటు చేస్తే సహించేది లేదని ఏఐఎండీఎస్ పేరుతో మద్యం షాపునకు బుధవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

## పాదగయ ఆలయ హుండీలు లెక్కింపు

**– 210 రోజులకు దేవస్థాన ఆదాయం రూ. 46,28,750/-**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించారు. 210రోజులకు నోట్లు రూపంలో రూ. 42,67,170/- నాణెములు రూ. 3,61,580/- లు వెరసి మొత్తం రూ. 46,28,750/- ( అక్షరాల 46 లక్షల ఇరవై ఎనిమిది వేల ఏడు వందల యాభై రూపాయలు) ఆదాయం వచ్చినదని ఆలయ అధికారులు తెలిపారు.

దేవస్థాన హుండీల లెక్కింపు కార్యక్రమంలో... దేవస్థాన సహాయ కమిషనర్ మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాథ రాజు, దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు కాకినాడ డివిజన్ వి.పణి కుమార్, దేవస్థానం సిబ్బంది, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం వారు ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి బుధవారం తాడేపల్లిగూడెంకు చెందిన బట్లంకి భుజంగరావు, భాగ్యలక్ష్మి దంపతులు రూ.50,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ చక్రధర్‌రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## ఏజెన్సీలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు






**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రంపచోడవరం మండలం బారంగి గ్రామంలో ఎన్టీఆర్ ట్రస్ట్ అండ్ జిఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో జిఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

రంపచో దవరం మండలం ముసురుమిల్లి పంచాయతీ బారంగి గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరానికి గిన్నెపల్లి, పెద్దబారంగి, ముసురుమిల్లి, చిన్నబారంగి ప్రజలు రావడం జరిగింది.

ఈ నెలాఖరు వరకు ఏజెన్సీ గ్రామాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగు తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో గిన్నెపల్లి కొండపల్లి వెంకటలక్ష్మి, కందుల సాయిబాబు, కంగల అబ్బాయిదొర, కుంజం రామకృష్ణ దొర, పల్లాల రామిరెడ్డి సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీజీహెచ్ సమగ్రాభివృద్ధికి చర్యలు

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**







**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఓపీ బ్లాకు వద్ద ఓపీ రిసిప్ట్ ఇచ్చే విధానాన్ని జీజీహెచ్ వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ పేరు నమోదు చేసుకునేందుకు వచ్చినవారితో ఎక్కడ నుంచి, ఎందు నిమిత్తం ఆస్పత్రికి వచ్చారు, ఓపీ నమోదు చేసుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులను అక్కడ ఉన్న ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డు ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఎంఆర్ఐ యూనిట్, ఎక్స్ రే యంత్రాల పనితీరు, కాన్సర్ విభాగంలో రేడియేషన్, కిమోథెరపీ చికిత్సల వివరాలు అడిగి తెలుసుకున్నారు.వివిధ వార్డులలో మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు ప్రతిరోజు ఫోటోలు పంపించాలని సిబ్బందిని జిల్లాకలెక్టర్ ఆదేశించారు. అనంతరం న్యూరో సర్జరీ,న్యూరో మెడిసిన్ విభాగాలను పరిశీలించి అవసరమైన పరికరాలు, సిబ్బంది ఖాళీల వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో నరాల బలహీనతను గుర్తించేందుకు అవసరమైన ఎన్.సీ.ఎస్,ఈఈజీ యంత్రాల అవసరతను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, న్యూరో వైద్య సిబ్బంది ఈసందర్భంగా జిల్లాకలెక్టర్‌దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాథ్‌ల్యాబ్, ట్రామాకేర్ యూనిట్లలో అవసరమైన పరికరాలు, సిబ్బంది నియామకం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ వార్డును సందర్శించి, చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ సర్జరీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గుండె జబ్బుల చికిత్స విభాగం తదితర విభాగాలను పరిశీలించి, వివిధ వార్డుల్లోకి అవసరమైన యంత్ర పరికరాలు, సిబ్బంది ఖాళీల వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఓటీ మిషన్లు, లైట్స్, ఓటీ బెడ్స్, ఏసీ, ఆపరేషన్ థియేటర్‌లోని ఇతర పరికరాలు, లిఫ్ట్‌సౌకర్యం, సిబ్బంది అవసరతను వివిధ విభాగాల వైద్యాధికారులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఈసందర్భంగాజిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పేరుగాంచిన ఆసుపత్రులలో కాకినాడ జీజీహెచ్ ఒకటని అన్నారు.ఇటీవలే యూఎస్‌కు చెందిన వైద్య బృందం క్యాన్సర్ సంబంధించిన ప్రత్యేక శిబిరాన్ని ఇక్కడ నిర్వహించడం జరిగిందన్నారు. జిజిహెచ్ లో అనేక పనులకు సంబంధించి చొరవ తీసుకునే లక్ష్యంతో నేడు జీజీహెచ్ లోని కొన్ని విభాగాలను ఈ సందర్భంగా పరిశీలించి వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఉభయగోదావరి జిల్లాలకుఆరోగ్యపరంగా ఉత్తమ సేవలు అందిస్తున్న జిజిహెచ్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జీజీహెచ్‌కు సంబంధించి ప్రాథమికంగా సర్జరీలు నిర్వహించడానికి, రోజువారీ చికిత్సలు అందించడానికి అవసరమైన యంత్ర పరికరాలు, ఓటీ బెడ్స్, లైట్స్, వెంటిలేటర్స్, ఎక్స్‌రే మిషన్, ఏసీ, ఆపరేషన్ థియేటర్లు, అవసరమైన సిబ్బంది వివరాలను సేకరించడం జరిగిందన్నారు.ఈ వివరాలన్నిటిని సమగ్ర నివేదిక రూపంలో సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. పరిశీలనలో జిల్లా కలెక్టర్‌వెంట జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా.పి.శ్రీనివాసు, ఆర్‌ఎంఎ డా.అనిత,ఎమర్జెన్సీ, ఆర్థోపెడిక్ విభాగాల అధిపతులు డా.కె.సత్యవాణి, డా.విఠల్, ఇతర విభాగల అధిపతులు, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ సీహెచ్. రత్నరాజు,ఇతర ఇంజనీరింగ్ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
తూర్పుగోదావరి
గురువారం,
17 అక్టోబర్ 2024



## శ్రీసత్యదేవుని దర్శించుకున్న సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ కె వెంకటరమణారెడ్డి



**అన్నవరం, మేజర్ న్యూస్ :** శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని బుధవారం ఉదయం రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె వెంకటరమణ రెడ్డి, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్ రమణ కుమార్ సింగల్, చీఫ్ ఇంజనీర్ ట్రాక్ మెషిన్స్ కృష్ణారెడ్డి, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ శేఖర్ బాబు, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్, కు ఆలయం అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రం శ్రీ స్వామి అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులతో ఆశీర్వచనం చేసి సాల్వ ఫోటో టెంపుల్ సూపరింటెండెంట్ బలువు వాసు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది సూపర్డెంట్ రామారావు, టి టి ఐ మోహన్, దేవస్థానం సిబ్బంది. తలుపులయ్య జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు, వట్టికోళ్ల దొరబాబు, తేటకాయల సాయి తదితరులు పాల్గొన్నారు.

## విధులు నిర్వహణలో బదిలీలు సాధారణం -ఏపిఎం సూర్యనారాయణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** విధులు నిర్వహణలో బదిలీలు ప్రభుత్వ ఉద్యోగులకు సర్వసాధారణమని పెద్దాపురం ఐకెపి ఏపీఎం పుప్పాల సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఐకెపి కార్యాలయంలో మండలంలోని కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించిన కమటం తవుడు పదోన్నతపై కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి ఏపిఎంగా వెళుతున్న సందర్భంగా ఐకెపి సిసిలు, వివో ఏలు తవు దును అత్యంత ఘనంగా సన్మానించారు. ఏపీఎం సూర్యనారాయణ మాట్లాడుతూ తవుడు మండలంలో విధులు నిర్వహణలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి డ్వాక్రా సంఘ సభ్యులకు, వివో ఏలకు మంచి సేవలు అందించారని, తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్, దుర్గ, కార్యాలయ సిబ్బంది సూర్య, పలురు వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 4వ తేదీన కొవ్వూరు గోస్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా హారతి ఉత్సవం

**- అధికారులు సమన్వయంతో శాఖల వారి కేటాయించిన ఏర్పాట్లు పటిష్టవంతంగా నిర్వహించాలి**
**- హారతికి వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించాలి**
**- పురపాలక సంఘం అధికారులు త్రాగునీరు, శానిటేషన్ పక్కాగా నిర్వహించాలి**
**- ఆర్డీవో సుస్మిత రాణి**
**- దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థ ఆచార్యులు**



**కొవ్వూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి ఏడాది గోష్పక్షేత్రంలో గోదావరి నదికి మహా హారతి ఉత్సవంలో భాగంగా నవంబర్ 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు గోదావరి మహా నీరాజనం మహా హారతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలోఆర్డీవో సుస్మిత రాణి, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థ ఆచార్యులుతో కలసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తిరుమల, తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా గోష్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా హారతి కార్యక్రమాన్ని నవంబర్ 4 నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున సుమారు పదివేల పైబడి హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకు వస్తారని, ఇందుకు సంబంధించి మత్స్యశాఖ, విద్యుత్, అగ్నిమాపక, ఇరిగేషన్, పోలీస్, దేవాదాయ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఆయా శాఖలకు కేటాయించిన ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. దాస సాహిత్య ప్రాజెక్ట్ అధికారి పగడాల ఆనంద తీర్థ ఆచార్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా తిరుమల, తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో దక్షిణ గంగగా పిలవబడే పవిత్ర గోదావరి నదమ్మ తల్లికి అందించే ఆత్మీయ హారతి కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు.

నవంబర్ 4వ తేదీ సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గోదావరి హారతి కార్యక్రమాన్ని కొవ్వూరు పట్టణం పవిత్ర గోదావరి నది తీరం గోష్పాద క్షేత్రం నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి వారి దివ్య ఆశీస్సులతో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరుగుతుందని భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవంబర్ 4వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు స్వామివారి భజన బృందంతో గానామృత కార్యక్రమాలు అనంతరం కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణంతో పాటు గోదారమ్మకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, పోలీస్, రెవెన్యూ, విద్యుత్తు, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక,మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలు మండలంలో పల్లె పండగ అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం





**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, తాటిపర్తి, జన జగ్గంపేట పలు గ్రామాలలో పండగ వాతావరణం ఏర్పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం, పిఠాపురం శాసనసభ్యుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు ప్రత్యేక నిధులు కేటాయించిన సంగతి తెలిసిందే. దీనిపై పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు కార్యకర్తలతో ప్రతి పల్లెలోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ 2014 నుండి పల్లె గ్రామాలలో రహదారులు దీనస్థితికి చేరుకోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు పలు సిసి రోడ్లు, బీటీ రోడ్లు దారి మార్గాల అభివృద్ధి పాఠశాలలకు కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు వివిధ గ్రామాలలో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపనలు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన వెంట వివిధ పంచాయతీ సర్పంచులు ఎంపీటీసీలు, జనసేన పార్టీ నాయకులు పిల్లా శివకుమార్, బస్సా చిట్టిబాబు, గొల్లపల్లి పెద్దబాబి, ఆ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు వెంట కార్యక్రమంలో పాల్గొన్నారు.

### పి.గన్నవరంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

**- పాల్గొన్న పి.గన్నవరం శాసనసభ్యులు**

**పి. గన్నవరం, మేజర్ న్యూస్ :** పి గన్నవరం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవ గిడ్డి సత్యనారాయణ పి.గన్నవరం మండలంలో పలు గ్రామాలలో రోడ్లకు శంకుస్థాపన చేశారు. దీనిలో భాగంగా నరేంద్రపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల యందు స్కూల్ గేటు నుండి మిగిలి ఉన్న సిసి రోడ్డు శంకుస్థాపన చేశారు. అనంతరం స్కూల్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం తహసీల్దార్ శ్రీ పల్లవి , మండల పరిషత్ అధికారి, స్కూల్ ప్రిన్సిపాల్ పున్నం వేణు,వైస్ ప్రిన్సిపాల్ ఆకెళ్ళ శాస్త్రి,నరేంద్రపురం గ్రామ సర్పంచ్ బీర వెంగమాంబ బాబూజీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సి.హెచ్.ప్రభాకర్ రావు, స్కూల్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పేరెంట్స్ కమిటీ సభ్యులు సాపే వెంకట రమణ, వార శ్రీనివాస్, పల్లి శ్రీనివాస్, పుల్లెల తారకం, ఉప్పాటి రాజేష్ గారు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దూకొట్ట అటవీ ప్రాంతంలో పులి సంచారం నిజమే అటవీశాఖ నిర్ధారణ



**కూనవరం, మేజర్ న్యూస్ :** దుగుట్ట నుండి తాటిలంక వరకు అటవీ ప్రాంతాలలో పెద్దపులి పాదముద్రలను బుధవారం నాడు అటవీ శాఖ సిబ్బంది సేకరించారు గురువారం నాడు దూగుట్ట అటవీ ప్రాంతంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని పెద నర్సింగపేట కాతవరం గ్రామస్తులను అధికారులు హెచ్చరించారు పెద్దపులి పశువుల పై దాడి చేస్తే పోలీసు శాఖ అటవీ శాఖకు తెలియపరచాలని పులి హాని చేస్తుందనే భయంతో విద్యుత్ తీగల అమర్చటం విషం కలిపిన ఆహారం పెట్టవద్దని కూనవరం రేంజ్ ఆఫీసర్ కరుణాకరన్ ఎస్సై ఎల్ శ్రీలత ప్రజలకు తెలిపారు.

## కాకినాడ రోడ్డులో మరో ప్రమాదం...

**- మహిళకు తీవ్ర గాయాలు**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట - కాకినాడ రోడ్డులోని ముత్యాలమ్మా ఆలయం సమీపంలో మరో ప్రమాదం బుధవారం ఉదయం జరిగింది. స్కూటీ పై సామర్లకోట వైపు వస్తున్న మహిళా గోతిలో పడగా ప్రమాదం జరగడంతో ఆమె తలకు తీవ్ర గాయ్యా లయ్యాయి. సమయానికి అంబులెన్సు అందిబాటులో లేకపోవడంతో కాకినాడ నుంచి బంధువులు వచ్చేంత వరకూ మహిళా అక్కడే ఉండాల్సి వచ్చింది. ఈలోగా కాకినాడ రంగారాయ మెడికల్ విద్యార్థి కళాశాలకు వెళుతూ గాయపడిన మహిళకు ప్రధమ చికిత్స సేవలు అందించారు. ముత్యాలమ్మా ఆలయం సమీపంలో బైపాస్ రోడ్డు వంతెన పనులు జరుగుతుండగా అక్కడ రోడ్డుకు అడ్డుగా తవ్వి దానిని సరైన రీతిలో పూడ్చక పోగా ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చెయ్యక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణీకులు అంటున్నారు.

# ప్రైవేట్ మద్యం విక్రయాలు


**- ఐఎంఎల్ డిపో వద్ద సందడి**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రైవేట్ మద్యం అమ్మకాలు బుధవారం ప్రారంభమాయ్యాయి. డ్రా పద్ధతిన లైసెన్స్ పొందిన డీలర్లు వారి దుకాణలకు మద్యం సరుకు తీసుకెళ్ళే క్రమంలో సామర్లకోట ఐఎంఎల్ డిపో నుండి సందడి నెలకొంది. కాకినాడ జిల్లా పరిధిలో 7సర్కిల్ లు ఉండగా వాటి పరిధిలో 155 మద్యం షాపులు కేటాయించడం జరిగినట్లు ఐఎంఎల్ డిపో ఇంచార్జి మేనేజర్ సిహెచ్ రమణబాబు చెప్పారు. అయితే ఈ సర్కిల్ పరిధిలో కాకినాడ నార్త్, కాకినాడ సౌత్, పెద్దాపురం, పిఠాపురం ప్రత్తిపాడు, తాళ్లరేవు, తుని మండలాలకు సంభందించి మద్యంషాపులున్నాయన్నారు. కాగా బుధవారం నుంచి మద్యం షాపులు తెరుచుకోనున్న నేపథ్యంలో స్థానిక జి రాగంపేట రోడ్డులో జగనన్న కాలనీ వద్దగల ఐఎంఎల్ డిపో వద్దకు పాటదారుల వాహనాలు మంగళవారం రాత్రికే చేరుకోవడంతో ఇక్కడ సందడి నెలకొంది. బుధవారం ఉదయం 8 గంటల నుంచే మద్యం సరుకు పంపిణీ ప్రారంభం కాగా మద్యం లోడ్లు దుకాణాలకు చేరుకున్నాయి. అనంతరం ఉదయం 10గంటలకు మద్యం విక్రయాలు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం ఇంకా కొత్త ధరలు ప్రకటించక పోవడంతో ప్రస్తుతం మద్యం సీసాలపై ఉన్న ధరలకే అంటే పాత ధరలకే డీలర్లు మధ్యాన్ని విక్రాయిస్తున్నారు. అయితే ప్రభుత్వం మారినా మద్యం ధరలు తగ్గక పోవడం పట్ల మందుబాబులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**- బెల్ట్ షాపులకు అనుమతి లేదు :** ప్రైవేట్ మద్యం విక్రయాల నేపథ్యంలో ఎలాంటి బెల్ట్ షాపుల నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవని పెద్దాపురం ఎక్సైజ్ అధికారి తెలిపారు. ఆయన మాట్లాడుతూ లాటరీ పద్ధతిలో షాపులు పొందిన డీలర్లు 6వ వంతు లైసెన్స్ ఫీజు చెల్లించి మద్యం విక్రయాలు ప్రారంభించినట్టు చెప్పారు. అయితే ప్రస్తుతం మద్యం ధరలకు సంభందించి ప్రభుత్వం నుంచి ధరల పట్టిక రానందున మద్యం సీసాలపై ఉన్న ధరలకే వ్యాపారులు విక్రాయించాల్సి ఉందన్నారు. అలాగే ఎక్కడా బెల్ట్ షాపులు పెట్టుకునే అనుమతులు లేనందున వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలాన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ మాత్రమే మద్యం విక్రయాలు జరపాలని, ఎలాంటి బార్లు ఏర్పాటుకు అనుమతులు లేనందున వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలని తెలుపుతూ నిబందనలు మీరితే చర్యలు తప్పవని వ్యాపారులను ఆయన హెచ్చరించారు.

## నేడు మండలంలో "పల్లె పండుగ" కార్యక్రమము



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలములో గురువారం కాండ్రకోట, గోరింట వడ్లమూరు, గ్రామములలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, చేతుల మీదుగా పల్లె పండుగ కార్యక్రమములో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకము క్రింద మంజూరుమైన సి.సి రోడ్లు మరియు డ్రైన్లు పనులకు శంకుస్థాపన కార్యక్రమము జరుగునని ఎంపీడీవో డి శ్రీ లలిత తెలిపారు.

# కాసులే ముఖ్యం..కాకినాడ టౌన్ ప్లానింగ్‌లో అవినీతి కంపు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** కాకినాడ స్పోర్ట్స్ స్టేడియం - ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డు, ఎస్.వి. రంగారావు బొమ్మ నుంచి నాగవనం వైపు వెళ్ళే దారిలో సాగుతున్న అక్రమ నిర్మాణాల యజమానుల నుంచి లక్షల్లో మామూళ్ళు పుచ్చుకొని, సక్రమమేనంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. బరితెగించిన అక్రమార్కులకే నోటీసులు జారీ చేసి అండగా నిలుస్తూ...తూతూమంత్రపు చర్యలతో మేము అనిపిస్తున్నారు. రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్‌గా కళ్యాణ మండపాలు, లాడ్జింగ్ గదులు, అక్రమ అంతస్థులు నిర్మిస్తున్నారు. దానివల్ల ఫైర్ సేఫ్టీ లేకపోవడంతో అతిపెద్ద కమర్షియల్ భవంతిలో గ్యాస్ ఇతర అగ్ని ప్రమాదంజరిగితే వందలమంది ప్రాణాలు హరీమంటాయి. దానికి బాధ్యులు ఎవరు.. ప్లాన్ ఇప్పించిన లైసెన్స్ సర్వేయర్ వహిస్తారా లేక టౌన్‌ప్లానింగ్ అవినీతి అధికారులు వహిస్తారా చెప్పండి.

అనుమతులు ఇలా...స్పోర్ట్స్ స్టేడియం రోడ్డు సిద్దార్ధ నగర్‌డోర్ నెం.70-1సి-7లో రెసిడెన్షియల్‌గా ప్లాట్ల నిర్మాణానికి లైసెన్స్ సర్వేయర్ బి.ఎ.నెం.1060/0073/బి/కెకెడి/ఎస్ఐడి/2023గా అనుమతులు తీసుకున్నారు. దాని ప్రకారం సెట్‌బ్యాక్స్‌గా ముందు 10 అడుగులు, మిగిలిన మూడు వైపులా ఆరు అడుగుల ఖాళీ స్థలం ఆకాశం కనిపించేలా విడిచిపెట్టి రెసిడెన్షియల్ నిర్మాణం చేపట్టాలి. కానీ ఇక్కడ ఎటువంటి సెట్‌బ్యాక్స్ విడిచిపెట్టలేదు. మొత్తం కమర్షియల్‌గా నిర్మాణం చేపట్టారు. కుడా నుంచి మంజూరైన ప్లాన్ ప్రకారమే నిర్మాణం చేపట్టేలా గట్టి చర్యల్లో భాగంగా ప్రభుత్వం నిర్మిస్తున్న బిల్డింగ్‌లో కొంత భాగం మార్టిగేజ్ కూడా యాజమాన్యం నుంచి చేరుస్తుంది.అయినా అక్రమాలు ఆగడంలేదు.నిర్మాణం పూర్తి అయిన తర్వాత కుడా ప్లానింగ్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి. ఇక్కడ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కలలో కూడా ఇవ్వరు. అంత దారుణంగా అక్రమంగా బరితెగించి నిర్మాణం చేపడుతున్నారు. అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది లక్షల్లో మామూళ్ళు పుచ్చుకొని వదిలేస్తున్నారు.ఆరవ అంతస్థు నిర్మాణం ఇక్కడ కొసమెరుపు.అనుమతి లేకుండాపై అంతస్థు నిర్మించడం అత్యంత నిబంధనలువ్యతిరేకం.దానిపైకెఎంసి 15/1060/కెకెడి/యుసి/2024గా నోటీసు ఇచ్చి మళ్లీ మామూళ్లు రెండవ సారి దండుకొన్నారని తెలుస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలి. ఈ భవనానికి ఫైర్ అనుమతులు లేవు. కళ్యాణ మండపానికి రెండు దారులు ఉండాలి. ఉన్న ఒకవైపు దారీ సరిగ్గా లేదు. లాడ్జింగ్ నిర్మాణం మరీ అక్రమం. పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డు మీదే పార్కింగ్ జరిగిపోతుంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు.నాగవనం దగ్గర గ్రౌండ్ మరియు రెండు అంతస్థుల రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొన్నారు. దానికి లైసెన్స్ సర్వేయర్ మూర్తి ప్లాన్ అనుమతులు పొందారు. ఎక్కడా సెట్‌బ్యాక్స్ వదలలేదు. ముందుభాగం 10 అడుగులు వదలాల్సి వుండగా రెండు అడుగులు కూడా వదలలేదట. మూడువైపులా కుడా అదే పరిస్థితి. కమర్షియల్‌గా నిర్మిస్తున్నారు. అనుమతులకు మించి మరో అంతస్థులో కొంతమేర నిర్మించారు. దీనికి ఎటువంటి నోటీసులు కెఎంసి ఇవ్వలేదు. ఈ భవంతివల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తనున్నాయి. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఈ కట్టడాలపై చర్యలు తీసుకోవడంతోపాటు, అధికారుల అవినీతిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


## 'పిహెచ్‌సి'ల్లో అవసరాలపై నివేదిక సమర్పించాలి - ఐటీడీఏ పీవో సింహాచలం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి అవసరాలపై నివేదికలు తయారుచేసి సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుండి బుధవారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే ఐటీడీఏ ఏపీవో జనరల్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎడియం & హెచ్ఓ, పిహెచ్ఓ, ఐసిడిఎస్ సిడిపిఓ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో ఐటీడీఏ పీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పివో కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వివిధ సౌకర్యాలకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించే విధంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. 104 వాహనానికి సంబంధించిన షెడ్యూల్ ప్రతీ నెల సమర్పించాలని సంబంధిత అధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో ఈనెల 17వ తేదీ నుండి 18వ తేదీ వరకు రెండురోజులపాటు వివిధ రకాల వ్యాధులు గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని ఆయన తెలిపారు. వైద్యాధికారులు, ఎం పి హెచ్ ఓ లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉండాలని, లేకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జననీ సురక్ష పథకం ఏ విధంగా అమలు చేయుచున్నది, అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏ రిక్వైర్మెంట్లు కావాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలవారీగా పిఓ అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ఏవిధంగా అమలు చేస్తున్నారో పిహెచ్‌సిలవారీగా ఆరా తీశారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలో ఏ అవసరాలు కావాలో ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా వివిధ గ్రామాలలో కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు తయారు చేసే సమర్పించాలన్నారు. ఐటీడీఏ పరిధిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డిఎన్‌వి రమణ, ఏడిఎం అండ్ హెచ్ఓ జి. శిరీష, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, పీహెచ్ఓ చిట్టిబాబు, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి సతీష్, ఎంపిహెచ్ఓ పీటర్ పాల్గొన్నారు.

# ప్రపంచం గర్వించదగ్గ మేధావి ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా

**పి.డి.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు**




**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ప్రపంచం గర్వించదగ్గ మేధావి, ఆదివాసులపై రాజ్యం చేస్తున్న దమనకాండను ప్రశ్నించిన గొంతుక, పీడిత ప్రజల హక్కుల కోసం నిరంతరం పరితపించిన సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా మృతి పట్ల. పి.డి.ఎస్.పి.వై.ఎల్, ఏ.ఐ.కె. ఎమ్.ఎస్. ఐఎఫ్టియు, ప్రజా సంఘాలు విప్లవ జోహార్లతో సంతాపం తెలియజేశారు. బుధవారం నాడు ద్రాక్షారామ స్థానిక కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు.రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్దు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ప్రొఫెసర్ జి. ఎన్. సాయిబాబా పుట్టి అక్కడే డిగ్రీ వరకు చదువుకుని ఉన్నత చదువులు హైదరాబాద్, ఢిల్లీ యూనివర్సిటీలో పూర్తి చేశారు. అక్కడే అధ్యాపక వృత్తిని చేపట్టారు. ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన ప్రొఫెసర్ సాయిబాబా అక్టోబర్ 12న నిమ్స్ ఆసుపత్రిలో గుండె సంబంధిత సమస్యతో ప్రాణం విడిచారని తెలిపారు. ప్రొ.సాయిబాబాకి ప్రజా సంఘాలు విప్లవ జోహార్లు తెలియజేస్తుందని అన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా నమ్ముకున్న ఆశయం కోసం, సిద్ధాంతం కోసం పనిచేసిన మడమ తిప్పని మహాయోధుడని కొనియాడారు. ప్రజలను, విద్యార్థులను, యువతను చైతన్య పరచడమే నేరంగా భావించిన బిజెపి ప్రభుత్వం ఆయనను 10 సంవత్సరాలపాటు నాగపూర్ జైలు చీకటి గదిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని అన్నారు. జైలులో ఆయన అనారోగ్యానికి గురైనప్పుడు ప్రభుత్వం వైద్యం అందించడానికి కూడా పూనుకోలేదని, చివరికి రోజులతరబడి తిండి, తాగునీరు కూడా అందించలేదని బిజెపి ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. చివరికి బిజెపి ప్రభుత్వం ఆయన 90 శాతం వికలాంగుడిగా ఉన్నప్పటికీ ఆయనకు బెయిలు రద్దు చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ఆయన భారత ప్రజల స్వేచ్ఛ కోసం ప్రాణం విడిచేంతవరకు పరితపించారని, ప్రొఫెసర్ సాయిబాబాను మానసికంగా, శారీరకంగా తీవ్ర చిత్రహింసలకు గురిచేసిన మోదీ ప్రభుత్వమే ఆయన మృతికి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఆయన కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పి.డి.ఎస్.యు, పి.వై.ఎల్, ఏఐకేఎంఎస్, కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు. నాయకులు చింతా రాజారెడ్డి, పి.వై.ఎల్. నాయకులు అంబటి కృష్ణ, జైభీమ్ సంక్షేమ సంఘం గుబ్బల శ్రీను, శిరో ముండనం పోరాట వేదిక నాయకులు వెంటపల్లి రామకృష్ణ, రేవు నాగేశ్వరరావు, చల్లపూడి పట్టాభి, పి.డి.ఎస్.యు.ఎం. శంకర్, ఆర్.భీమశంకర్, తేజ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై సమీక్ష సమావేశం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** బుధవారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత జిల్లా కోర్టు ఆవరణలో అండర్ ట్రయిల్ ముద్దాయిల కమిటీ మీటింగ్, ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ మరియు హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విచారణలో ఉన్న ముద్దాయిల కేసుల దర్యాప్తు, చార్జ్ షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిలు/జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కుంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించి, సంబంధిత న్యాయస్థానాలకు తగిన సిఫార్సులు చేశారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ బాడి మీటింగ్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమాలను బాధితుల పరిహారమునకు సంబంధిత అంశాల ను ఆమోధించడం జరిగినది హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో గౌరవ సుప్రీం కోర్టు వారి ఆదేశాలను అనుసరించాలని అన్నారు. డిశంబరు 14 న జరగబోవు జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కార యోగ్యమున్న వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలియ చేసారు.ఈ సమావేశంలో ఒకటవ అధనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివ కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఎమ్ అనురాధ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్ బాబు, తూర్పు గోదావరి జిల్లా ఎస్.పి డి.ఎన్ .కిశోర్ , జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాములు , కాకినాడ అడిషనల్ ఎస్.పి ఎమ్. జె. వి. భాస్కర్ రావు, కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్.పి ఏ. వి. ఆర్. పి బి ప్రసాద్, రాజమహేంద్రవరం గవర్నమెంట్ ప్లీడర్ సి.హెచ్. ప్రసాద్, కొత్తపేట ఆర్. డి ఓ అమలాపురం ఆర్. డి. ఓ., సెంట్రల్ జైలు, మహిళ జైలు , జిల్లా సబ్ జైలు అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు,పంచాయతి అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.